క్లుప్తంగా

తరిగొండ ఆలయంలో పూజలు



స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

గుర్రంకొండ : మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తిక మాసంలో మూడవ శనివారం రోజున టీటీడీ ఆధ్వర్యంలో ఆలయంలో విశిష్టమైన పూజలు నిర్వహించారు. ఉదయాన్నే స్వామివారికి పలు రకాల నైవేద్యాలు సమర్పించారు. తోమాల సేవ, ఏకాంతసేవ కావించారు. ఈ సందర్భంగా స్వామివారిని పలు రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకొని స్వామివారిని దర్శించుకున్నారు. అర్చకులు భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

శనైశ్వరుడికి తైలాభిషేకం



హోమాలు నిర్వహిస్తున్న పండితులు

పెద్దతిప్పసముద్రం : కార్తిక మాసోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక శివాలయం సేవకులు సనగరం పట్టాభి రామయ్య ఆధ్వర్యంలో పూజలు, హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయంలో ఉదయం నుంచి వేద పండితులచే నవ గ్రహాలకు అభిషేకం, శనైశ్వరునికి తైలాభిషేకం, నవగ్రహ హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేయడంతో పాటు అన్నదాన సౌకర్యం కల్పించారు.

మండల పూజ ప్రారంభం



అన్నప్రసాదం పంపిణీ చేస్తున్న కమిటీ సభ్యులు

మదనపల్లె సిటీ : స్థానిక అయ్యప్పనగర్‌లోని శ్రీ అయ్యప్పస్వామి ఆలయంలో శనివారం మండల పూజ కార్యక్రమం ఘనంగా ప్రారంభించారు. ఆలయం ఎదుట ధ్వజారోహణంతో పూజలు ప్రారంభించారు. ఉదయం గణపతి హోమంను అర్చకులు రమణమూర్తి, కార్తిక్ దీక్షిత్ పూజలు నిర్వహించారు. అయ్యప్ప మాలాధారులు స్వామికి దర్శించుకుని భజనలు చేశారు. దాత డాక్టర్ రామిరెడ్డి అన్నప్రసాద వితరణ చేశారు. నేటి నుంచి ఉదయం, రాత్రి వచ్చే ఏడాది సంక్రాంతి 15 వరకు అన్నప్రసాద వితరణ జరుగుతుందని అయ్యప్ప ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు జర్మనీరాజు, బాలుస్వామి, బాలుయాదవ్, హేమంత్, శివమూర్తి,కేశవ, తదితరులు పాల్గొన్నారు.

భక్తి మార్గంతోనే ముక్తిమార్గం




ప్రసంగిస్తున్న స్వామి కృష్ణానంద

పీలేరు : మానవుడికి భక్తి మార్గంతోనే ముక్తి లభిస్తుందని చిన్మయమిషన్ స్వామి కృష్ణానంద అన్నారు. శనివారం స్థానిక సదుం మార్గంలోని సర్వోదయ విజ్ఞాన క్షేత్రంలో చిన్మయమిషన్ ఆధ్వర్యంలో కార్తీక వన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. తులసీమాత పూజ, గోమాత పూజ, అమలక దామోదరస్వామి పూజలు నిర్వహించారు. అనంతరం కృష్ణానంద స్వామి మాట్లాడుతూ కార్తీకమాసంలో భక్తి శ్రద్ధలతో దీపారాధన చేయాలని సూచించారు. గోమాతను పూజించాలని, రక్షించాలని కోరారు. అనంతరం భక్తులకు కార్తీక వనభోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో చిన్నయమిషన్ సభ్యులు, పలువురు భక్తులు, ఆర్ఎస్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

విత్తన కాయల పంపిణీ

పెద్దతిప్పసముద్రం : రబీ సీజన్‌లో భాగంగా రైతులకు రాయితీపై వేరుశనగ విత్తన కాయలను పంపిణీ చేశామని ఏవో ప్రేమలత తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ మండలానికి 410 బస్తాల కేసిక్స్ రకం కాయలు వచ్చాయని ఇప్పటికే బోరు, విద్యుత్ సౌకర్యం వున్న పంటను సాగు చేసే రైతుల వివరాలను రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి మాత్రమే విత్తన కాయలను అందజేస్తున్నామని ఏవో తెలిపారు.

డిసెంబర్ 14న లోక్ అదాలత్



పోలీసులతో చర్చిస్తున్న న్యాయమూర్తి

మదనపల్లె : వచ్చేనెల 14వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరనాయక్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి విజయకుమార్‌రెడ్డి వెల్లడించారు. శనివారం కోర్టు సమావేశ మందిరంలో పోలీస్ అధికారులు, న్యాయమూర్తులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న సివిల్, క్రిమినల్ కేసులను రాజీ చేసుకోవాలన్నారు.

అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయండి



రామసముద్రం: అవగాహన ర్యాలీలో అధికారులు, ప్రజాప్రతినిధులు

మదనపల్లె : పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపీడీఓ తాజ్‌మస్రూర్ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక 2025 - 26కు సంబంధించి మండల సర్పంచులు, సెక్రటరీలకు ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామపంచాయతీలలోని గ్రామాల సమగ్ర అభివృద్ధి కోసం స్థానిక ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పనులను ఎంపిక చేసి అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఎంపిక చేసిన పనులు, ప్రణాళికలను జీపీడీపీ పోర్టల్‌లో ఆన్‌లైన్ చేయాలన్నారు. కార్యక్రమంలో టీఓటీ ట్రైనర్లు షర్ఫుద్దీన్, భానుమూర్తి, గిరిధర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రామసముద్రంలో..

రామసముద్రం : రామసముద్రం మండలం ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం గ్రామపంచాయతీల అభివృద్ధిపై సర్పంచ్‌లు, ఎంపీటీసీ, పంచాయతీ కార్యదర్శులకు శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ కుసుమకుమారి అధ్యక్షతన ఎంపీడీఓ భానుప్రసాద్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ అభివృద్ధి, ఆవశ్యకత, గ్రామ పంచాయతీ విధులు, బాధ్యతలు, ప్రణాళిక అప్‌లోడ్ చేసే విధానంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో ఏఓ గౌస్‌బాషా, టీఓటీలు నవాజ్, నాగరాజు, మునస్వామినాయక్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్స్, వీఓ లీడర్లు పాల్గొన్నారు.

ప్రణాళికలు సిద్ధం చేయాలి..

పీలేరురూరల్ : గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని మదనపల్లె డీఎల్‌పీఓ నాగరాజ ఆదేశించారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సర్పంచ్‌లకు, ఎంపీటీసీ సభ్యులకు, పంచాయతీ కార్యదర్శులకు, గ్రామ సచివాలయ సభ్యులకు ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అవసరాలు ఉన్న పనులను గుర్తించి పనులకు సంబంధించి అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేసి మండల కార్యాలయానికి అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శివశంకర్, వైస్ ఎంపీపీ ఎన్.వి. చలపతి, ఈఓపీఆర్‌డీ

కేవీపల్లె : మండలంలో గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపీడీఓ సుధాకర్ అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ ఈశ్వరమ్మ అధ్యతన అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ప్రణాళికలు రూపొందించాలన్నారు. అధికారులతో పాటు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు గ్రామ పంచాయతీ అభివృద్ధిలో భాగస్వామ్యులు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రణాళికలు రూపొందించుకోవాలి..

గుర్రంకొండ : పంచాయతీల్లో చేపట్టబోయే అభివృద్ధి పనులపై ముందుగా ప్రణాళికలు రూపొందించుకోవాలని రాయచోటి డీఎల్‌డీఓ లక్ష్మీపతి అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రానున్న రెండు నెలల్లో ఏఏ అభివృద్ధి పనులు చేపట్టాలో అధికారులు ముందుగా ప్రణాళికలు రూపొందించు కోవాలన్నారు. సిద్ధం చేసిన ప్రణాళికలను ఆన్‌లైన్‌లో పొందుపరచాలని సూచించారు. ఇకపై పంచాయతీలకు మంజూరయ్యే నిధులను ముందుగా రూపొందించుకొన్న పనులకే ఖర్చు చేయాల్సి ఉంటుందన్నారు. వంద శాతం నిధుల్లో 60 శాతం నిధుల్లో తాగునీరు, పారిశుధ్యం కోసం ఖర్చు చేయాలని పేర్కొన్నారు. మిగిలిన 40 శాతం నిధులను పంచాయతీల్లో పనిచేసే సిబ్బంది, కార్మికుల జీతాలు, కొత్త పైపులైన్ల నిర్మాణాలు, బోరు మోటార్ల మరమ్మతులు వంటి పనులకోసం ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఇందులో ఎటువంటి మార్పులు ఉండవన్నారు. కచ్చితంగా ముందస్తు ప్రణాళికలతో రూపొందించుకొన్న పనులనే పంచాయతీల్లో చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ వెంకటేశులు, ఈఓపీఆర్‌డీ బ్రహ్మానందరెడ్డి, ఏఓ నాగశివారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



కేవీపల్లె : సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ సుధాకర్

గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ

తంబళ్లపల్లె : గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమష్టిగా కృషి చేయాలని ఎంపీడీఓ ఉపేందర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఎంపడీఓ కార్యాలయంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ ఇచ్చారు. ఈఓపీఆర్డీ దిలిప్‌కుమార్ అభివృద్ధి ప్రణాళిక రూపొందించడంపై వివరించారు. సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, మండల స్థాయి అధికారులు, పంచాయతి కార్యదర్సులు, గ్రామ సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు, సంఘమిత్రలు సమన్వయంతో గ్రామాల్లో ప్రజల అవసరాలను గుర్తించాలన్నారు. వారి అవసరాల మేరకే ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు.

కేవీపల్లె ఈఓపీఆర్‌డీ సస్పెన్షన్

కేవీపల్లె : కేవీపల్లె ఈఓపీఆర్‌డీగా పని చేస్తున్న గఫూర్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందాయి. గతంలో గఫూర్ పీలేరు గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పని చేసిన సమయంలో గ్రామ పంచాయతీ నిధులు అవకతవకలు జరిగాయి. దీంతో గఫూర్‌ను సస్పెన్షన్ చేస్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

విద్యార్థులకు బహుమతులు

బి.కొత్తకోట : మండలంలోని గోళ్లపల్లె హైస్కూల్‌లో బాలల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందించామని సంస్థ చైర్మన్ ఎస్.కృష్ణారెడ్డి శనివారం తెలిపారు. 50 మంది విద్యార్థులకు ప్రోత్సాహం అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

వెలుగు ఏపీఎం నీరజ బదిలీ

కురబలకోట : కురబలకోట వెలుగు ఏపీఎం నీరజ శనివారం బదిలీ అయ్యారు. చిత్తూరు కార్యాలయంలో రిపోర్టు చేయాల్సిందిగా ఉత్వర్వులలో పేర్కొన్నారు. నాలుగేళ్లుగా ఆమె ఇక్కడ ఏపీఎంగా సమర్థవంతంగా పనిచేశారు. డ్వాక్రా సంఘాల బలోపేతానికి తన వంతుగా కృషి చేశారు. రాజకీయ కారణాలతో ఆమె బదిలీ కాబడినట్లు భావిస్తున్నారు. ఆమె స్థానంలో కురబలకోటలో ఎఫ్‌పీఓలో పనిచేస్తున్న ఏపీఎం శ్రీనివాసులుకు వెలుగు ఏపీఎంగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పనిచేశాం

ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి



ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాప్రతినిధులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

పెద్దమండ్యం : గత ప్రభుత్వ హయాంలో గ్రామాల అభివృద్ధి, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేశామని తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ రెడ్డి తెలిపారు. పెద్దమండ్యం మండలంలో శనివారం పార్టీ నాయకులతో కలిసి విస్తృతంగా పర్యటించారు. వెలిగల్లు, బండమీదపల్లె గ్రామాలలో ప్రజాప్రతిధులు, పార్టీ నాయకులతో ఎమ్మెల్యే మాట్లాడారు. అనంతరం స్థానిక ఎంపీడీవో కార్యాలయానికి చేరుకున్న ఎమ్మెల్యే ప్రజా ప్రతినిధులతో సమావేశమయ్యారు. పలు సమస్యలను ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. గతంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు బిల్లులు ఇంకా రావాల్సి ఉందన్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి ఏవైనా సమస్యలు ఉంటే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే తెలిపారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పేరుతో అధికారంలోకి వచ్చి ప్రజలను పట్టించుకోలేదన్నారు. అనంతరం పెద్దమండ్యం పంచాయతీ చెరువుకిందపల్లెలో అనారోగ్యంతో బాధపడుతున్న పార్టీ నాయకుడు వెంకటమల్లయ్యను పరామర్శించి వైద్య ఖర్చుల కోసం రూ.25 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ముసలికుంట, బండ్రేవు గ్రామాలలోని పార్టీ నాయకులతో మాట్లాడారు. ఇదిలా ఉండగా ఎంపీడీవో కార్యాలయానికి ఎమ్మెల్యే వస్తున్నట్లు తెలియడంతో పెద్ద ఎత్తున పోలీసులు స్టేషన్ వద్దకు చేరుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రం పూర్ణచంద్రిక, మాజీ ఎంపీపీ టి.రెడ్డిశేఖరరెడ్డి, మాజీ జడ్పీటీసీ గుర్రం రమేష్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మండల కన్వీనర్, జెఎస్‌వి కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు కృషి చేయాలి

తంబళ్లపల్లె : విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బంది కృషి చేయాలని ట్రాన్స్‌కో డీఈ గంగాధరం తెలిపారు. శనివారం ఆయన కన్నెమడుగు, తంబళ్లపల్లి, గోపిదిన్నె సబ్ స్టేషన్లను తనిఖీ చేశారు. సిబ్బంది పని తీరుపై ఆరా తీశారు. ఎక్కడా లో ఓల్టేజి సమస్య రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఏడీఈ గోవిందరెడ్డి, ఏఈ శేషుకు సూచించారు. విధినిర్వహణలో నిర్లక్ష్యం చేయరాదని సూచనలు, సలహాలు ఇచ్చారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు



బోరు పైపులను పరిశీలిస్తున్న అధికారులు



పెద్దతిప్పసముద్రం : మండలంలోని పట్టెంవాండ్లపల్లె పంచాయతీ బాగేపల్లిలో నెలకొన్న తాగునీటి సమస్యపై శనివారం సాక్షి పత్రికలో 'మా గొంతు తడిపి పుణ్యం కట్టుకోండి' అని ప్రచురితమైన వార్తపై అధికారులు స్పందించారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ బాలచంద్రాచారి, ఈవోఆర్డీ యోగానంద్, మెకానిక్ చంద్రశేఖర్, సర్పంచ్ లక్ష్మీదేవితో కలసి బాగేపల్లికి వెళ్లారు. కాలిపోయిన ప్రభుత్వ బోరు మోటారు మరమ్మతులపై ప్రత్యేక చొరవ తీసుకున్నారు. సోమవారం నాటికి బోరు నుంచి ప్రజలకు తాగునీరు అందేలా చర్యలు చేపట్టామని అధికారులు తెలిపారు.

బిల్లులు ఇవ్వకుండా అభివృద్ధిని అడ్డుకుంటారా!

జీపీడీపీ సమావేశాన్ని బహిష్కరించిన సర్పంచులు, ఎంపీటీసీలు



జీపీడీపీ శిక్షణను బహిష్కరించి సమావేశమైన సర్పంచులు, ఎంపీటీసీలు

బి.కొత్తకోట : గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్న సర్పంచులకు ఇవ్వాల్సిన బిల్లులు ఇవ్వకుండా అధికారులు అభివృద్ధిని అడ్డుకుంటున్నారని మండలానికి చెందిన సర్పంచులు, ఎంపీటీసీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం బి.కొత్తకోట మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, ఎంపీటీసీలకు గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ)పై ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. దీన్ని తాము బహిష్కరిస్తున్నట్లు సర్పంచులు, ఎంపీటీసీలు శుక్రవారమే ప్రకటించి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సానుకూల స్పందన లేకపోవడంతో శిక్షణను బహిష్కరించిన సర్పంచులు, ఎంపీటీసీలు మండలంలోని అమరనారాయణపురంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీలో ఎదుర్కొంటున్న వివిధ సమస్యలు, అభివృద్ధి పనులకు అందాల్సిన బిల్లులపై చర్చించారు. పంచాయతీల్లో అభివృద్ధి, సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తుంటే అధికారులు సహకరించడంలేదని వాపోయారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు ఖర్చుచేసిన బిల్లులను మంజూరు చేయాలని అధికారులను విన్నవించిన ఫలితం లేకపోయిందన్నారు. మండల పరిషత్‌లో రూ.80 లక్షలకు పైబడిన నిధులు ఉండగా వాటిని సద్వినియోగం చేయడం లేదన్నారు. 15వ ఆర్థిక సంఘం రెండో విడత నిధులు మళ్లీ మంజూరైనాయని, ఈ రెండు విడతల నిధులు ఎప్పుడు ఖర్చు చేస్తారో అధికారులు చెప్పడం లేదన్నారు. తక్షణమే సర్పంచులకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని, ఆ తర్వాతే కొత్త పనులు చేపడతామన్నారు. ఆర్థిక సంఘం నిధులతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు మండల పరిషత్ సమావేశం నిర్వహించి కేటాయింపులు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రభుత్వ కార్యక్రమాల విషయంలో అధికారులకు సహకరించని స్పష్టం చేశారు. పంచాయతీల్లో సమస్యలు, ప్రజలకు అవసరాలపై అధికారులు దృష్టి పెట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో వైస్‌ఎంపీపీ ఖాదర్‌వలీ, ఎంపీటీసీలు ఈశ్వరమ్మ, రామసుబ్బారెడ్డి, సుబ్బరాయప్ప, సర్పంచులు బి.నాగిరెడ్డి, ప్రమీల, గిరిజ, లక్ష్మీదేవి, రుక్మిణి, ఉజ్జయిని సాంబశివ, యర్రమద్ద లక్ష్మీదేవి, పుష్పలత, ఉమామహేశ్వరీ, చంద్ర, మాకిరెడ్డి రవి కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

కన్నెమడుగు సంఘమిత్ర మార్పుపై విచారణ



రోడ్డుపై బైఠాయించి నిరసన తెల్పుతున్న మహిళా సంఘాల సభ్యులు

తంబళ్లపల్లె : మండలంలోని కన్నెమడుగు సంఘమిత్రను గతంలో ఏపీఎం, సీసీలు నిబంధనలకు వ్యతిరేకంగా ఎంపిక చేశారు. దీనిపై ఆగ్రహించిన మహిళా సంఘ సభ్యులు జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్, వెలుగు పీడీ సత్యనారాయణకు ఫిర్యాదు చేశారు. వారి ఆదేశాల మేరకు శనివారం స్త్రీశక్తి భవన్‌లో వెలుగు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వేణుమాధవ్, డీపీఎం లక్ష్మీ ప్రసాద్ రెడ్డి, ఏపీఎం గంగాధర్, మండల సమాఖ్య అధ్యక్షురాలు రామలక్ష్మి, కార్యదర్శి నౌజియా సమక్షంలో మహిళా సంఘాల లీడర్లు, సభ్యులను విచారించారు. మహిళా సభ్యులందరూ మూకుమ్మడిగా సంఘమిత్రను మార్పు చేయాలని గతంలో మాకు తెలీకుండా గ్రామ సభ నిర్వహించకుండా ఏక పక్షంగా సంఘమిత్రను ఎంపిక చేయడం ఏమిటని ఆగ్రహించారు. విచారణ అధికారులు నిబంధనల మేరకే మహిళా సంఘాల గ్రూపు లీడర్లే సంఘమిత్రను ఎంపిక చేసే హక్కు ఉందని అందరి సమ్మతి మేరకే డిసెంబరు 3న గ్రామ సమాఖ్య సమావేశంలో సంఘమిత్రను ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. అయితే ఇప్పటికే వాయిదాల మీద వాయిదాలు వేస్తున్నారని ఈరోజే అందరి సమక్షంలో సంఘమిత్రను ఎంపిక చేయాలని పట్టుపట్టారు. అధికారులు డిసెంబరు 3వ తేదీకి వాయిదా వేయడంతో మహిళలు ఆగ్రహించారు. రోడ్డుపై బైఠాయించి నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ లోకేష్‌రెడ్డి నిరసన కారులతో చర్చించి అనుమతి లేకుండా రోడ్డుపై బైఠాయించడం సరికాదని సర్ది చెప్పడంతో మహిళలు నిరసన విరమించారు.

సమయపాలన పాటించాలి



మాట్లాడుతున్న డీఎం వెంకటరమణారెడ్డి

మదనపల్లె సిటీ : ఆర్టీసీ బస్సులను సమయపాలన ప్రకారం నడపాలని ఆర్టీసీ-1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి అన్నారు. శనివారం స్థానిక డిపో కార్యాలయంలో సమయపాలన మాసోత్సవాలను పురస్కరించుకుని సమావేశం నిర్వహించారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందించాలన్నారు. బస్సు సమయం ప్రకారం నడిపితే ప్రయాణికుల మన్ననలు పొందవచ్చన్నారు. ఓఆర్‌పీఎస్ సర్వీసులు, నాన్ ఓఆర్‌పీఎస్ సర్వీసులు తప్పకుండా సమయం పాటించాలన్నారు. ట్రాఫిక్ సూపర్‌వైజర్లు దీనిపై పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో సీఐ రేవతి, ఎంఎఫ్ రవి, సిబ్బంది పాల్గొన్నారు.

108 సర్వీసులను ప్రభుత్వమే నిర్వహించాలి



నిమ్మనపల్లె: ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న 108 సిబ్బంది

నిమ్మనపల్లె : 108 అంబులెన్సు సర్వీసుల నిర్వహణ నుంచి అరబిందో ఫార్మా తప్పుకోవడంతో, ప్రభుత్వమే 108 సర్వీసులను నిర్వహించాలని కోరుతూ నిమ్మనపల్లె 108 సిబ్బంది అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. సకాలంలో జీతాలు చెల్లించకపోతే ఈనెల 25వ తేదీ నుంచి సమ్మె చేయనున్నట్టు నోటీసు అందజేశారు. శనివారం నిమ్మనపల్లె 108 సిబ్బంది పీహెచ్‌సీ కార్యాలయంలో యూడీసీకి, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ పరమేశ్వర్ రెడ్డికి, పోలీస్ స్టేషన్‌లో ఏఎస్‌ఐ జిలానీబాషాకు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 108 అంబులెన్సు సర్వీస్ నిర్వహణకు ప్రైవేటు సంస్థలను ఆహ్వానిస్తూ టెండర్లు నిర్వహించరాదన్నారు. ప్రభుత్వమే నిర్వహణ బాధ్యతను తీసుకొని, వెంటనే సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించాలన్నారు. 108 సిబ్బంది జీతాల బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. జీతాలు చెల్లించకపోతే 108 ఎంప్లాయిస్ స్టేట్ యూనియన్ నిర్ణయం మేరకు ఈనెల 25వ తేదీ నుంచి సమ్మె ప్రారంభించి, విధులను బహిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో 108 సిబ్బంది రెడ్డి జస్వంత్, అమరనారాయణ, సద్దాం హుస్సేన్, వాణి తదితరులు పాల్గొన్నారు.

సమ్మె నోటీసు అందజేత

రామసముద్రం : 108 అంబులెన్స్‌లను నేరుగా ప్రభుత్వమే నిర్వహించాలని కోరుతూ 108 సిబ్బంది శనివారం ఎంపీడీఓ భానుప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిబ్బందికి ప్రభుత్వమే నేరుగా జీతాలు పంపిణీ చేయాలని, 12 గంటల విధానాన్ని రద్దు చేసి, 8 గంటల పని విధానాన్ని అమలు పరచాలన్నారు. అలాగే ఇప్పటి వరకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. ప్రస్తుత డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించకుంటే ఈనెల 25వ తేదీ నుంచి సమ్మెకు వెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఎంటీలు శ్రీకాంత్, ప్రసాద్, పైలెట్ వెంకటరమణ పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ మహాసభలను విజయవంతం చేయండి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్టీయూ నాయకులు

మదనపల్లె సిటీ : ఏఐఎస్ఎఫ్ 49వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి ఆర్‌వీ రమణ, జిల్లా కార్యదర్శి మధుసూధన్ అన్నారు. శనివారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర మహాసభల పోస్టర్లను ఎంఈఓ-2 రాజగోపాల్ ఆవిష్కరించారు. విజయనగరంలో ఈనెల 27 నుంచి 30వ తేదీ వరకు మహాసభలను జరుగుతాయన్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవ్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారానికి శ్రీకారం చుట్టాలని తెలిపారు. జాతీయ నూతన విద్యా విధానం వల్ల ఇప్పటికే రాష్ట్రంలో చాలా విద్యాసంస్థలు మూతపడ్డాయన్నారు. జాతీయ విద్యా విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్డీఏ ప్రభుత్వం ఎన్నికల్లో విద్యార్థులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలన్నారు. యువగళం పాదయాత్రలో విద్యామంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీ ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అమలు చేయాలన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ హాస్టల్స్ సమస్యలు గాలికి వదిలేశారన్నారు. పెండింగ్‌లో ఉన్న విద్యార్థులకు మెస్‌బిల్లులు విడుదల చేయాలన్నారు. హాస్టల్స్‌కు నూతన భవనాలు నిర్మించాలన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు చంద్రశేఖర్, చలపతి, జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం సుబ్బారెడ్డి, పీడీ దేవకి, విద్యార్థి సంఘ నాయకులు గంగారాణి, నవీన్‌కుమార్, రెడ్డినవదీప్ పాల్గొన్నారు.

ఆహార సంరక్షణపై విద్యార్థులకు అవగాహన

లక్కిరెడ్డిపల్లి : ఆహార సంరక్షణ, ఫుడ్ ప్రాసెసింగ్‌పై అవగాహన నైపుణ్యం కలిగి ఉండాలని కస్తూర్బా పాఠశాల ప్రిన్సిపల్ నాగలక్ష్మి పేర్కొన్నారు. శనివారం లక్కిరెడ్డిపల్లి వెంకటేశ్వర బేకరీలో విద్యార్థులకు సమగ్ర శిక్షణ ఆధ్వర్యంలో టై సెంటర్ ఫర్ లర్నింగ్ లిమిటెడ్ వారి సౌజన్యంతో ఫుడ్ ప్రాసెసింగ్‌పై వృత్తి విద్యా ఉపాధ్యాయురాలు వీర పద్మజ విద్యార్థులకు అవగాహన కల్పించారు. బేకరీలో తయారు చేయు పదార్థాలు, కేకులు వంటి పంటల తయారీపై విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడంతో వారిలోని నైపుణ్యాలను వెలికితీయవచ్చన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయ ఉద్యమకారులను స్మరించుకోవాలి



గ్రంథాలయ ఉద్యమకారుల చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న గ్రంథాలయాధికారి అమరనాథ్

పీలేరు : గ్రంథాలయ ఉద్యమకారులను స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని గ్రంథాలయాధికారి అమరనాథ్, కోన జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం చెంగల్‌రాయుడు అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం ఎస్ఆర్ రంగనాథన్, అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటాలకు పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా అమరనాథ్ మాట్లాడుతూ గ్రంథాలయ ఉద్యమకారులు పాతూరు నాగభూషణం, అయ్యంకి వెంకటరమణయ్య, మాడపాటి హనుమంతరావు గ్రంథాలయానికి చేసిన సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. ఈ సందర్భంగా గ్రంథాలయానికి ఎస్ఎల్‌వీ బుక్‌షాపు యాజమానులు సంజీవయ్య, అమరనాథ్ రూ. 15 వేలు విలువ చేసే పుస్తకాలు గ్రంథాలయానికి వితరణగా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

మదనపల్లె సిటీ : గ్రంథాలయాలను విద్యార్థులను సద్వినియోగం చేసుకోవాలని రిటైర్డు లైబ్రేరియన్లు నారాయణమూర్తి, జనార్దన్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక సీటీఎం రోడ్డులోని శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖుల గురించి స్మరించుకున్నారు. గ్రంథాలయ ఏర్పాటుకు ఎంతో మంది కృషి చేశారని గుర్తు చేశారు. స్వాతంత్ర్య ఉద్యమంలో గ్రంథాలయాలు ఎంతో కీలకపాత్ర పోషించినట్లు తెలిపారు. విద్యార్థులకు కావాల్సిన పుస్తకాలు లైబ్రరీలో అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి వసంతకుమారి, బీటీ కాలేజీ రిటైర్డ్ ప్రిన్సిపల్ వై.ఎస్.మునిరత్నం, ప్రముఖ రచయితలు టీఎస్ఏ క్రిష్ణమూర్తి, తిరుపతిరావు, యుగంధర్, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

కలికిరి: ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం అలవరచుకోవాలని ఎంఈఓ కరీముల్లా సూచించారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ పుస్తక పఠనంతో విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమాచారం లేకుండా అభివృద్ధిపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మహమూద్

పెద్దతిప్పసముద్రం : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం గ్రామ పంచాయతీల అభివృద్ధిపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి చాలా మంది సర్పంచ్‌లకు అధికారులు కనీస సమాచారం ఇవ్వలేదనే విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. కొన్ని గ్రామాల్లో అయితే సమావేశానికి ఒక గంట ముందు కార్యదర్శులు ఫోన్ ద్వారా సర్పంచ్‌లకు సమాచారం అందించారని పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 20 గ్రామ పంచాయతీలు ఉండగా సమావేశానికి సగం మందికి పైగా సర్పంచ్‌లు హాజరు కాకపోవడం అధికారుల అలసత్వానికి అద్దం పడుతోంది. పలు గ్రామాల్లో అయితే కార్యదర్శుల కొరతతో పాటు సర్పంచ్‌లు, కార్యదర్శుల నడుమ సమన్వయ లోపం కూడా ఉందనే ఆరోపణలు ఉన్నాయి. అనంతరం సమీక్షకు హాజరైన ఎంపీపీ మహమూద్ మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజల భాగస్వామ్యంతో పంచాయతీలకు మంజూరైన నిధులతో గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించాలని ఆకాంక్షించారు. ఎంపీడీవో అబ్దుల్ కలాంఆజాద్, ఈవోఆర్డీ యోగానంద్‌లు మాట్లాడుతూ 2025-2026 ఆర్థిక సంవత్సరంకు సంబంధించి యాక్షన్ ప్లాన్‌ను రూపొందించాలన్నారు.

18న సచివాలయాల ముట్టడి

ఓబులవారిపల్లె : పట్టణ ప్రాంత పేద ప్రజలకు రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంత పేద ప్రజలకు మూడు సెంట్లు ఇంటిస్థలం కేటాయింపునకు ఈనెల 18వ తేదీ సీపీఐ ఆధ్వర్యంలో సచివాలయ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించినట్లు మండల సీపీఐ కార్యదర్శి చింతలపూటి నాగమ్మ పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలు శనివారం చిన్నఓరంపాడు పంచాయతీలో ఆవిష్కరించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి ఇంటిస్థలం లేని పేదలు పాల్గొని జయప్రదం చేయాలని ఆమె కోరారు.